సాక్షి
విశాఖపట్నం
శనివారం । 8 । మార్చి । 2025

# విజయోస్తు స్త్రీరస్తు..

Happy Women's Day



**మహిళ**
మహోన్నత వ్యక్తి
మహాద్భుత శక్తి
అపరిమిత ప్రేమమూర్తి
అనంత శాంతమూర్తి

**మహిళ**
చేయని కార్యం లేదు
రాయని కావ్యం లేదు
నేర్వని విద్య లేదు
అసాధ్యం ఏదీ లేదు

మగువా మగువా లోకానికి తెలుసా నీ విలువా..
మగువా మగువా నీ సహనానికి సరిహద్దులు కలవా..
అటు ఇటు అన్నింటా, నువ్వే జగమంతా
పరుగులు తీస్తావు ఇంటా బయట...
అలుపని రవ్వంత అననే అనవంట...
వెలుగులు పూస్తావు వెళ్లే దారంత...
అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేస్తున్న 'ఆమె'కు వందనం అంటోంది నగరం. అమ్మగా, ఆలిగా, అక్కగా, చెల్లిగా.. ఆత్మీయతతో అనురాగాన్ని పంచే..అమృతమూర్తికి పాదాభివందనం చేస్తోంది.

## మహిళలు మరింత ప్రగతి సాధించాలి



డాబాగార్డెన్స్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగర ప్రజలకు శుక్రవారం మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు ఏ రంగంలోనైనా అగ్రగాములుగా నిలుస్తున్నారన్నారు. సైన్యం నుంచి సైన్స్ వరకు, వ్యవసాయం నుంచి వ్యాపారం వరకు, కవిత్వం నుంచి క్రీడల వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు.

## ఆటోతో జీవన ప్రయాణం



ఆటో నడుపుతూ వాణికుమారి

దాబాగార్డెన్స్: ఆటో డ్రైవర్ అనగానే మనకు పురుషులే గుర్తుకొస్తారు. డ్రైవింగ్ ఫీల్డ్ కష్టంతో కూడుకున్నది కావడంతో.. మహిళలు ఈ రంగంవైపు పెద్దగా ఆసక్తి చూపరు. డ్రైవింగ్ ఫీల్డులోకి వచ్చిన మహిళల్లోనూ ఎక్కువ మంది కొన్నేళ్లు మాత్రమే ఈ రంగంలో ఉంటారు. దీనికి రకరకాల కారణాలు ఉండొచ్చు. కానీ మీరు ఇప్పుడు చూస్తున్న మహిళ మాత్రం 23 ఏళ్లుగా.. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆరిలోవకుచెందిన వాసంశెట్టి వాణికుమారికి భర్త లేడు..కుమార్తెతో కలిసి జీవిస్తోంది. డ్రైవింగ్ నేర్చుకుంది. దీంతో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. కుమార్తెను డిగ్రీ వరకు చదివించింది. ఆరిలోవ..జగదాంబ జంక్షన్, తిరిగి జగదాంబ జంక్షన్–ఆరిలోవ వరకు టికెట్ సర్వీస్ చేస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇలా టికెట్ సర్వీస్ చేస్తూ ఆదాయం పొందుతోంది. తనకు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉందని, రుణం తీసుకుని సొంతంగా ఆటో కొనుగోలు చేశానని వాణి కుమారి చెప్పారు.

## అమ్మ ప్రేమ అమేయం



ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రపంచంలో అమ్మ ప్రేమ కంటే గొప్ప ప్రేమ లేదు. ఆమెను ఎవరితోనూ పోల్చలేం. ఈ ప్రపంచంలో పిల్లలను ఎక్కువగా ప్రేమించే తల్లి.. తమలాంటి దుర్భర పరిస్థితులు పిల్లలు అనుభవించకూడదని ఆ తల్లి ఆకాంక్ష..కూలి పనులకు వెళుతూ కుమార్తెను చదివించుకుంటోంది. అమ్మ చేయి పట్టుకుని ఇంటికి వెళుతున్న ఈ దృశ్యం సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

## వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో నేడు మహిళా దినోత్సవం



మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వుడా చిల్డ్రన్ ఎరీనాలో శనివారం ఉదయం నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన మహిళలను సత్కరించనున్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## భర్త ప్రోత్సాహం ఆమె కల సాకారం

### రాష్ట్రంలో ఎల్ఎల్‌డీ చేసిన తొలి వ్యక్తి ఆచార్య సీతామాణిక్యం



ఏయూక్యాంపస్: చదువుకు ఎక్కువగా ప్రాధాన్యత లేని రోజుల్లో 17 ఏళ్ల వయసులో పెళ్లిపీటలపై కూర్చున్నారు. పెళ్లిచూపుల సమయంలో పెళ్లికొడుకు చదువుకుంటావా అని అడిగిన ప్రశ్న ఆమెలో కొత్త ఆశలను చిగురించేలా చేసింది. అలా భర్త సహకారంతో తన చదువును కొనసాగించారు. నేడు దేశంలో ప్రతిష్టాత్మకమైన ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వహించే స్థాయికి ఎదిగారు ఆచార్య కె.సీతామాణిక్యం. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందంటారు. కానీ ఆచార్య సీతామాణిక్యం విజయం వెనుక ఆమె భర్త తమ్మిరెడ్డి ఉన్నారు. చిన్న వయసులో పెళ్లి చేసుకున్నా విద్యపై ఉన్న ఆసక్తితో ఆమెను ప్రోత్సహించారు. ప్రైవేటుగా డిగ్రీ పూర్తిచేసి అనంతరం ఎం.ఏ హిస్టరీ, బ్యాచ్‌లర్ ఆఫ్ లా, ఎం.ఏ ఇగ్లీషు, ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి మాస్టర్ ఆఫ్‌లా(ఎల్ఎల్ఎం) పూర్తిచేశారు. ఒకవైపు కుటుంబం, పిల్లల బాధ్యతలను నిర్వహిస్తూ ఒడిశాలోని బ్రహ్మపుర విశ్వవిద్యాలయం నుంచి 2000 సంవత్సరంలో సైబర్ నేరాలపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు. 2014లో పోస్ట్ డాక్టోరల్ ఇన్ లా(ఎల్ఎల్‌డీ)ని అందుకున్నారు. రాష్ట్రం నుంచి ఈ డిగ్రీ సాధించిన తొలి వ్యక్తి ఆచార్య సీతామాణిక్యం కావడం విశేషం. వివాహం, కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే తన ఆకాంక్షలను సాకారం చేసుకోవచ్చు అనడానికి ఆచార్య సీతామాణిక్యం జీవితం ఒక ఉదాహరణ మాత్రమే.

అనంతరం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏయూలో 2006లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2021లో ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. 24 జూన్ 2024 నుంచి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. 2023లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు.

## వహ్వా.. అవ్వ..!



రైతుబజార్ స్టాల్‌లో శబరి

సీతమ్మధార : ఆమె వయసు 94. ఇంట్లో హాయిగా మనమలు, మనవరాళ్లతో కాలక్షేపం చేసే వయసు. వృద్ధాప్యాన్ని పక్కన పెట్టి..ఓపిక ఉన్నంతవరకు కష్టపడతానంటోంది. సీతమ్మధార రైతుబజార్‌లో ఓ స్టాల్‌లో గ్రీన్‌పీస్, క్యారెట్ అమ్ముతూ జీవనం సాగిస్తోంది. భీమిలి మండలం చేపలుప్పాడకు చెందిన వృద్ధ రైతు పేరు నారాయణమ్మ. అందరూ శబరి అని పిలుస్తారు. ఇప్పటికీ ఎంతో హుషారుగా రైతు బజార్‌కు వచ్చి వెళుతుంటుంది. 20 ఏళ్లుగా సీతమ్మధార రైతు బజార్‌లో గ్రీన్‌పీస్, క్యారెట్ విక్రయాలు జరుపుతూ అందరికీ పెద్ద దిక్కుగా వ్యవహరిస్తోంది. భర్త మృతి చెందగా.. ఐదుగురు సంతానం. ఇంట్లో ఖాళీగా ఉండడం నచ్చదు..అందుకే ఇప్పటికీ రైతు బజార్‌లో విక్రయాలు జరుపుతున్నానని శబరి చెప్పింది. రైతు బజార్‌కు వచ్చినవాళ్లంతా ఆమెను చూసి వహ్వా..అవ్వా అంటూ శబరి వద్ద కొనుగోలు చేస్తున్నారు.

## రైలు ప్రయాణంలో తోడు.. మేరీ సహేలీ

సాక్షి, విశాఖపట్నం:

రైల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళల భద్రతే ప్రధాన లక్ష్యంగా భారతీయ రైల్వే.. వినూత్న విధానాలను అవలంబిస్తోంది. ఎవరి తోడు లేకుండా ప్రయాణిస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి వారికి అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు అనుసరిస్తున్న సరికొత్త ఆలోచనే 'మేరీ సహేలి'. అంటే.. నా స్నేహితురాలు అని అర్థం. ట్రైన్ ఎక్కినప్పటి నుంచి గమ్యస్థానానికి చేరుకునేంత వరకూ ఆర్‌పీఎఫ్ ఏర్పాటు చేసిన మేరీ సహేలి బృంద సభ్యులు వారి స్నేహితులుగా తోడుంటారు. అంతేకాదు.. అసౌకర్యాలకు గురవుతున్న మహిళా ప్రయాణికులకు సహాయం చేయడంతో పాటు భద్రతను పెంచే లక్ష్యంతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ పరిధిలో 'సుభద్ర వాహిని' పేరుతో ప్రత్యేక మహిళా రైల్వే సిబ్బంది బృందం సేవలందిస్తోంది. మేరీ సహేలి, సుభద్ర వాహినిలో మొత్తం 16 మంది మహిళా ఆర్‌పీఎఫ్ సిబ్బంది సేవలందిస్తున్నారు.

**మేరీ సహేలీ..:** వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి నిత్యం రైళ్ల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రైలు ప్రయాణికుల్లో ఒంటరిగా వెళ్తున్న మహిళలుంటారు. వీరి వివరాల్ని ఆర్‌పీఎఫ్ సేకరిస్తుంది. ఇందుకోసం రైలు ప్రయాణికుల రిజర్వేషన్ల ఆధారంగా ఇలాంటి మహిళల వివరాల్ని గుర్తించేందుకు రైల్వే శాఖ సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (క్రిస్) యాప్‌ను వినియోగిస్తోంది. మేరీ సహేలీ బృంద సభ్యులు తమ ట్యాబ్‌ల ద్వారా వివరాలు సేకరించి.. వారి వద్దకు వెళ్లి వారికి అవగాహన కల్పిస్తారు. ఏదైనా అవసరం ఉంటే సమాచారం అందించాలంటూ ఫోన్ నంబర్ కూడా ఇస్తారు. రైలుదిగేంత వరకూ వారితో టచ్‌లో ఉంటారు. మహిళల బోగీల్లో పురుషులు చొరబడినా వారిపై కేసులు నమోదు చేస్తుంటారు. ఇలా

మహిళా ప్రయాణికులకు రక్షణగా ప్రత్యేక బృందం

సుభద్ర వాహిని పేరుతో మరో రక్షణ బృందం

మేరీ సహేలీ ద్వారా ప్రతిరోజు 10 మంది మహిళలకు రక్షణ



ప్రయాణికురాలికి అవగాహన కల్పిస్తున్న మేరీ సహేలీ ఉద్యోగి

మహిళల భద్రతకు సంబంధించి విశాఖ స్టేషన్ పరిధిలో గత ఏడాది 1,151 మందిపై కేసులు నమోదు చేయగా.. ఈ ఏడాది ఇప్పటి వరకూ 89 కేసులు నమోదు చేసినట్లు ఆర్‌పీఎఫ్ సీఐ కిమిడి రామకృష్ణ తెలిపారు.

**సుభద్ర వాహిని :** సుభద్ర వాహిని మహిళా ప్రయాణికులను అప్రమత్తం చేయడం, ప్లాట్‌ఫామ్‌లపై, రైళ్లలో మహిళలపై నేర కార్యకలాపాలను నిరోధించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. తక్షణ సహాయం కోరుకునేవారు ఎవరైనా ఉంటే సులభంగా గుర్తించడానికి సుభద్ర వాహిని సభ్యులకు ప్రత్యేకమైన డ్రెస్ కోడ్ ఉంటుంది. విశాఖపట్నం, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రైల్వే స్టేషన్లలో ఈ బృందం విడతల వారీగా ప్రయాణిస్తూ మహిళలకు రక్షణ కవచంలా నిలుస్తున్నారు. హెల్ప్‌లైన్ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులపైనా స్పందించి.. వాటిని పరిష్కరించడంలో సుభద్రవాహిని బృందం దూకుడుగా వ్యవహరిస్తోంది. ప్రతి ఏటా దాదాపు 3500 మంది మహిళలకు రక్షణ కవచంలా సుభద్ర వాహిని బృందాలు వ్యవహరిస్తున్నాయని ఆర్‌పీఎఫ్ సీఐ రామకృష్ణ వివరించారు. మహిళలకు రైల్లో ఏ సమస్య తలెత్తినా కంట్రోల్ రూమ్ 8978080777 నంబర్‌కు గానీ.. రైల్వే టోల్‌ఫ్రీ నంబర్ 139లో సంప్రదించాలని ఆయన మహిళలకు సూచించారు.

## అతివల ఆర్థిక స్వేచ్ఛకు అడుగులు





ప్రసూనాంబ

సాక్షి, విశాఖపట్నం : ఆర్థిక వనరుల నిర్వహణ అబలలకు కొత్తేమీ కాదు. ఇంట్లో మగవారిపై ఆధారపడకుండా స్వయంగా డబ్బు సంపాదించినప్పుడు కలిగే ఆత్మ విశ్వాసం దాని ద్వారా వచ్చే ఆర్థిక స్వేచ్ఛ ముందు ఏదీ సాటిరాదు. అందుకే ఆర్థిక వ్యవహారాల్లో మహిళలను మించిన ఆర్థికవేత్తలు మరొకరు ఉండరని చెబుతుంటారు. అంతటి శక్తి ఉన్న మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించాలనే సంకల్పంతో ప్రారంభమైంది ది విశాఖ మహిళా మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆ పరేటివ్ సొసైటీ.

**పాతికేళ్ల ప్రస్థానంలో...**

నగరానికి చెందిన బి. ప్రసూనాంబ సాధారణ గృహిణి. రైతుబజారుకు వెళ్లిన సమయంలో అక్కడ మహిళా వ్యాపారులు డైలీకలెక్షన్, కాల్‌మనీ వ్యాపారుల నుంచి డబ్బులు అప్పులు తీసుకుంటూ ఇబ్బందులు పడుతున్న వైనాన్ని చూశారు. మహిళలు అప్పుల కోసం ఎందుకు ఇబ్బంది పడాలి.. వారి డబ్బుల్ని వారే పొదుపు చేసి వాడుకునేలా వ్యవస్థను ఏర్పాటు చెయ్యాలని సంకల్పించారు. ఆ ఆలోచన నుంచి పుట్టిందే ది విశాఖ మహిళా మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆ పరేటివ్ సొసైటీ. సీతమ్మధారలో 10 మంది సభ్యులతో 2020 ఆగస్టులో ప్రారంభమైంది. పాతికేళ్ల ప్రస్థానంలో ఇప్పుడు ఉత్తరాంధ్రలో 16 శాఖలుగా విస్తరించింది. 816 మంది సభ్యులుండగా.. 10 వేల మంది వరకూ పొదుపు చేసుకునే మహిళలున్నారు. ఇప్పటి వరకూ 2 వేల మంది మహిళలకు రుణాలు మంజూరు చేసి.. వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దింది సొసైటీ. ఈ మహిళల సొసైటీలో పనిచేసే వారు కూడా మహిళలే కావడం విశేషం. మొత్తం 50 మంది ఉద్యోగులున్నారు. జీవితంలో ఆర్థికంగా, కుటుంబ పరంగా చితికిపోయిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది సొసైటీ. ఉపాధి అవసరమైన వారిని ఎంపిక చేసి వారికి ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్నామని చైర్‌పర్సన్ వైటీ ప్రసూనాంబ చెబుతున్నారు. సొసైటీ తరఫున సామాజిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ.. బాలికలకు, మహిళలకూ చేయూతగా నిలుస్తున్నారు.

## 24 ఏళ్లుగా నవ్విస్తూ...



కళాకారిణి శివజ్యోతి

సీతంపేట: ఆమె స్టేజి ఎక్కితే కడుపుచెక్కలుకావాల్సిందే..ఆమె టైమింగ్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. హాస్య నటిగా శివజ్యోతి సుపరిచితురాలు. 2000 సంవత్సరంలో రావి కొండలరావు స్థాపించిన హ్యూమర్ క్లబ్‌లో ఆమె సభ్యురాలు..నాటి నుంచి నేటి వరకు నవ్వులు పంచుతున్నారు. కష్టాలు.. కన్నీళ్లు..బాధలు..వీటినన్నింటినీ చిటికెలో మాయం చేసేది హాస్యం. నా స్కిట్లకు ప్రేక్షకులు నవ్వుతుంటే ఆ ఆనందం వేరు అంటున్నారు జ్యోతి. ప్రస్తుతం ఫ్రెండ్స్ కామెడీక్లబ్‌తో పాటు మరో రెండు కామెడీక్లబ్స్‌లో ప్రతి ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో స్కిట్స్ చేసి ప్రేక్షకులను నవ్విస్తున్నా... దాదాపు 24 ఏళ్లుగా నవ్విస్తుంటం నా అదృష్టంగా భావిస్తున్నా. 1978 నుంచి కూచిపూడి డ్యాన్సర్‌గా, 1989 నుంచి రంగస్థల కళాకారిణిగా వందలాది స్టేజి ప్రదర్శనలు ఇచ్చా. జేవీ సోమయాజులతో కలిసి బుచ్చమ్మ పాత్ర (కన్యాశుల్కం)ధారిగా 500లకు పైగా ప్రదర్శనలు ఇచ్చా..కందుకూరి, నంది అవార్డు, కళాభినేత్రి, హాస్య నటి శిరోమణి, నాట్య మయూరిగా ఎన్నో అవార్డులు అందుకున్నా.

## వైద్య వృత్తి.. సేవా కీర్తి



కంచిపాటి శిరీష

విశాఖ విద్య: విశాఖ నగరంలోని మద్రిపాలెం వుడా లే అవుట్ కాలనీకి చెందిన కంచిపాటి శిరీష దంతవైద్యురాలు. భర్త శ్రీనివాసరావు కూడా వైద్యుడే. ఎంచక్కా ఏ ప్రైవేటు ఆస్పత్రో పెట్టుకొని ప్రాక్టీస్‌పై దృష్టి పెడితే, బోలెడంత వెనుకేసుకోవచ్చు. తల్లిదండ్రులు ఇచ్చిన ఆస్తిపాస్తులు, కుటుంబ పరంగా ఉన్న అండదండలతో లగ్జరీ లైఫ్ గడిపేయవచ్చు. డాక్టర్ శిరీష ఆలోచనలు వేరు..తల్లిదండ్రులు పీవీఎస్‌రావు, విజయలక్ష్మి నేర్పిన విలువలతో ఆమె స్ఫూర్తివంతమైన జీవనం గడుపుతున్నారు. మద్రిపాలెం వుడా లే అవుట్ కాలనీ అంటే నగరంలోని ప్రముఖుల నివాస స్థావరంగా గుర్తింపు ఉంది. ఇలాంటి చోట, కాలనీ అసోసియేషన్‌లో డాక్టర్ శిరీష కీలకంగా వ్యవహరిస్తున్నారు. సన్నిహితుల ట్రస్ట్ ద్వారా విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పారి శ్రామిక ప్రాంతాలతో పాటు, నగర శివారు కాలనీలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా రోగులకు మందులను అందజేస్తున్నారు. అంతేకాకుండా కళలు, సాహిత్య రంగాల్లో కూడా పేరుతెచ్చుకున్నారు.

**మహిళ పాత్ర ఎంతో కీలకం**

మహిళ అంటే భార్యగా, తల్లిగా సక్సెస్ అయితేనే సరిపోదు. నేటి రోజుల్లో మహిళ పాత్ర కీలకంగా మారింది. మహిళ బాగుంటే ఫ్యామిలీ బాగుంటుంది. ఆడపిల్ల అనే చిన్నచూపు చూసే రోజులు పోయాయి. దేన్నైనా సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తి గల మహిళలు ఎంతో మంది ఉన్నారు.

–డాక్టర్ కంచిపాటి శిరీష

## గేట్ల దగ్గర నుంచి గెట్ అవుట్

- మరోసారి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు

సాక్షి, విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ప్రక్రియ మళ్లీ మొదలైందని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం విధులకు వెళ్లిన కాంట్రాక్ట్ కార్మికులు ఆయా ప్రవేశ గేట్ల వద్ద బయోమెట్రిక్ అటెండెన్స్ కోసం ప్రయత్నించినప్పటికి వీలు కాలేదు. సుమారు 250 మంది కార్మికులకు బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు కాకపోవడంతో సాంకేతిక సమస్య అనుకున్నారు. తీరా కార్మిక సంఘాల నాయకులు వాకబు చేయగా వారిని బయోమెట్రిక్ నుంచి తొలగించినట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ కొనసాగుతున్నట్టు తెలియవచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 30 శాతం మేరకు తొలగింపు ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ జరుగుతున్నట్టు సమాచారం. ఈ అంశంపై విభాగంలోని అధికారులను వివిధ సంఘాల నాయకులు ప్రశ్నించగా తమకు ఏం తెలియదంటూ దాట వేశారని ఆరోపించారు. ఈ అంశంపై పోరాటానికి సన్నద్ధమవుతున్నామని కార్మిక నాయకులు తెలిపారు.

## నేటి నుంచి పీ-4 సర్వే

మహారాణిపేట: పేదరిక నిర్మూలన లక్ష్యంగా పీ–4 సర్వేను శనివారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ఈ సర్వే జరుగుతుందని శుక్రవారం పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా పది సూత్రాల్లో ప్రథమంగా పేదరిక నిర్మూలన,పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో పీ–4 సర్వేకు రూపకల్పన చేశామన్నారు. 27 ప్రశ్నలతో కూడిన హౌస్ హోల్డ్ సర్వేను గ్రామ సభల్లో కూడ ప్రవేశపెడతారని, లబ్ధిదారుల ఎంపిక కూడా గ్రామ సభల ద్వారా జరుగుతుందన్నారు. పీ4 సర్వేకు సంబంధించి ప్రజల అభిప్రాయాలు, సూచనలను, నిర్దేశిత క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని కలెక్టర్ కోరారు.

**పారదర్శకంగా సర్వే నిర్వహించాలి**

తగరపువలస: రైతులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా రైతులు రీ సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన ఆనందపురం మండలం గొట్టిపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా రీ సర్వే జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. డ్రోన్, రోవర్ ద్వారా రీ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. రీ సర్వే పంట ప్రక్రియలను పరిశీలించారు. సర్వే పూర్తయిన తరువాత గ్రామసభ నిర్వహించి రైతులకు పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. గొట్టిపల్లి గ్రామ సచివాలయంతో పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయన వెంట సర్వే విభాగం ఏడీ సూర్యారావు, తహశీల్దార్ శ్యాంప్రసాద్, ఎంపీడీవో జానకి తదితరులు పాల్గొన్నారు.



గొట్టిపల్లిలో రీ సర్వే వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

## 28న విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలు

విశాఖ లీగల్ :

ప్రతిష్టాత్మకమైన విశాఖ న్యాయవాదుల సంఘం నూతన వార్షిక ఎన్నికలు ఈనెల 28వ తేదీన జరుగుతాయని సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఎన్నికల అధికారిగా ప్రముఖ న్యాయవాది జి.ఎం. రెడ్డి నియమితులయ్యారు. 15 రోజులు ముందు నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఇప్పటికే వివిధ పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. న్యాయవాదులందరూ ఓటు హక్కు పొందడానికి తక్షణమే తమ సభ్యత్వ రుసుము చెల్లించాలని సంఘం కార్యదర్శి డి.నరేష్ కోరారు. ప్రధానంగా అధ్యక్ష, ఉపాధ్యక్ష,కార్యదర్శి పదవులకు గట్టి పోటీ ఉంది. 12 లేదా 13 తేదీల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

## షోకాజ్ నోటీసులతో ఉద్యమాన్ని అణచలేరు

- వెంటనే ఉపసంహరించుకోవాలి
- ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల డిమాండ్

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్‌కు ఇచ్చిన షోకాజ్ నోటీసును తక్షణం ఉపసంహరించుకోవాలని సిటు జిల్లా అధ్యక్షుడు ఎస్.రామారావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని ప్రభావితం చేసే విధంగా కార్మిక సంఘాల ప్రతినిధులపై ఉక్కు యాజమాన్యం కుట్రలు చేస్తోందన్నారు. కర్మాగారంలో నేటి వరకు ఉన్న ప్రతి ప్రయోజనం పోరాటాల ద్వారానే సాధించుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. పోరాటంలో అనైక్యతను సృష్టించడం కోసం ప్రభుత్వం, యాజమాన్యాలు ఎంత ప్రయత్నించినా.. స్టీల్ కార్మికులు మరింత ఐక్యంగా ముందుకు సాగుతారన్నారు. గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీ ద్వారా స్టీల్ పరిశ్రమలో సమస్యలు పరిష్కారం కావని ఆయన వివరించారు. దీన్ని సమర్థవంతగా నడపడం కోసం సమర్థవంతమైన నాయకత్వం కావాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారని ఆయన గుర్తు చేశారు. సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులతో కార్మిక ఉద్యమాన్ని అణచలేరన్నారు. వెంటనే యాజమాన్యం నోటీసును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సిటు గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి, అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కె.ఎస్.ఎన్.రావు, రమణమూర్తి, డి.వి.రమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు, డి. సురేష్‌బాబు, రామ్‌కుమార్, రామ్మోహన్‌కుమార్, పరంధామయ్య, డేవిడ్ తదితరులు యాజమాన్యం వైఖరిని నిరసించారు.



ప్రసంగిస్తున్న రామారావు

## 'హోలీ'కి ప్రత్యేక రైళ్లు

**తాటిచెట్లపాలెం:** హోలీ సందర్భంగా ఆయా మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. ◆ భువనేశ్వర్-చర్లపల్లి(08479) స్పెషల్ ఈ నెల 10, 17, 24వ తేదీల్లో భువనేశ్వర్‌లో మధ్యాహ్నం 12.10 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 6.32 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.50 గంటలకు చర్లపల్లి వెళ్తుంది. చర్లపల్లి-భువనేశ్వర్(08480) హోలీ స్పెషల్ ఈ నెల 11, 18, 25వ తేదీల్లో ఉదయం 9.50గంటలకు చర్లపల్లిలో బయల్దేరి అదే రోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.32 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.10గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది. ◆ విశాఖపట్నం-ఎస్ఎంవీ బెంగళూరు(08549) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9, 16, 23వ తేదీల్లో మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి, మరుసటిరోజు మధ్యాహ్నం 12.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది. ఎస్ఎంవీ బెంగళూరు-విశాఖపట్నం(08550) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10, 17, 24వ తేదీల్లో మధ్యాహ్నం 3.50 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ◆ బనారస్-విశాఖపట్నం(05042) వన్ వే స్పెషల్ ఈ నెల 8వ తేదీ రాత్రి 10.50 గంటలకు బనారస్‌లో బయల్దేరి 10వ తేదీ మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ◆ ఆజంఘడ్-విశాఖపట్నం (05040) వన్ వే స్పెషల్ ఈ నెల 8న రాత్రి 11.55 గంటలకు ఆజంఘడ్‌లో బయల్దేరి 10వ తేదీ సాయంత్రం 4.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

## జిల్లా టూరిజం ఇన్‌చార్జ్ అధికారిగా సుధాసాగర్

**సాక్షి, విశాఖపట్నం:** రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ సర్టిఫికేషన్ కోల్పోయిన తర్వాత దిద్దుబాటు చర్యలు చేపట్టిన పర్యాటక శాఖ.. ఏం చెయ్యాలనే దానిపై తర్జనభర్జనలు పడుతోంది. ఇన్‌చార్జ్ ఆర్డీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రమణ ప్రసాద్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో.. బ్లూఫ్లాగ్ బీచ్ ఆనవాళ్లు కోల్పోయి.. గుర్తింపు కూడా రద్దైన విషయం తెలిసిందే. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన.. హడావిడిగా ప్రభుత్వం అధికారుల బదిలీల ప్రక్రియ చేపట్టింది. ఈ ప్రక్రియ నిర్వహించిన నాలుగు రోజులకే మళ్లీ ఆర్డర్లు మార్చేశారు. ముందుగా జిల్లా టూరిజం అధికారిగా ప్రస్తుతం అల్లూరి జిల్లా డీటీవోగా వ్యవహరిస్తున్న గరికిన దాసుని నియమిస్తూ పర్యాటక శాఖ ఈ నెల 3న ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన బాధ్యతలు చేపట్టేలోపే.. మరొకరికి బాధ్యతలు అప్పగిస్తూ మరో సర్క్యులర్ జారీ చేసింది. వాస్తవానికి దాసు శుక్రవారం డీటీవోగా బాధ్యతలు చేపట్టనున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. ఈలోగా.. గురువారం అర్ధరాత్రి డీటీవోగా డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పర్యాటకశాఖ అధికారులు సర్క్యులర్ జారీ చేశారు. ప్రస్తుతం సుధాసాగర్ హెచ్‌పీసీఎల్ ల్యాండ్ ఎక్విజిషన్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## అనకాపల్లిలో బీబీఎస్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్

**ఎంవీపీకాలనీ:** రామేశ్వరం-భువనేశ్వర్ మధ్య ప్రయాణించే బీబీఎస్ వీక్లీ ఎక్స్‌ప్రెస్(20895/96) అనకాపల్లి స్టేషన్‌లో ఆగనుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ బి.సునీత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా ఈ రైలు అనకాపల్లిలో హాల్ట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



# ఆ రోజుల్లో.. అండగా.!

- మహిళలకు శానిటరీ న్యాప్‌కిన్స్ వెండింగ్ మెషీన్లు
- ప్రధాన కంపెనీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు






మోడ్రన్ శానిటరీ ప్యాడ్ వెండింగ్ మెషీన్ (ఇన్‌సెట్) బొడ్డేటి ఝాన్సీ రాణి

**సాక్షి, విశాఖపట్నం :** మహిళలు రుతుక్రమంలో శుభ్రంగా ఉండటం ఎంతో అవసరం. అందుకు కావాల్సిన ఉత్పత్తులు ఆ సమయానికి అందుబాటులో లేకపోతే.? పనిలో ఉన్నా.. కార్యాలయంలో ఉన్నా.. సినిమా హాల్‌లో ఉన్నా.. అకస్మాత్తుగా పీరియడ్స్ వస్తే..? ఏం చేయాలి. ఎక్కడికి వెళ్లాలి.? ఎలా శానిటరీ ప్యాడ్స్ కొనుగోలు చేయాలి.? దీనిపై ఇప్పటికీ మహిళలకు ఎన్నో సందేహాలున్నాయి.

గతంలో ఎదురైన అనుభవాలు ఆమెకు పాఠాలు నేర్పాయి. భవిష్యత్తులో ఆ రోజుల్లో మహిళలు సులువుగా ప్యాడ్స్ పొందేందుకు శానిటరీ న్యాప్‌కిన్స్ వెండింగ్ మెషీన్లు తయారు చేయాలన్న ఆలోచన అంకురించి.. మార్కెట్లోకి తీసుకొచ్చారు బొడ్డేటి ఝాన్సీ రాణి. మహిళల అవసరాలకు అనుగుణంగా వెండింగ్ మెషీన్ల తయారీ సంస్థ ఎన్‌సీకోడ్ వెండింగ్ సిస్టమ్స్ కో ఫౌండర్‌గా వ్యవహరిస్తున్న ఝాన్సీ రాణి.. 2021 నుంచి మహిళలకు అవసరమైన మెషీన్ల తయారు చేస్తూ మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. అధునాతన శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మెషీన్లు అందుబాటులోకి తీసుకొచ్చి.. మహిళల్లో రుతుస్రావ సమయంలో అభయమిచ్చేలా రూపొందిస్తున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ స్టార్టప్ హబ్ (ఆ హబ్‌లో)లో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. బహిరంగ ప్రదేశాలు, విద్యా సంస్థలు, కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ఉత్తమ నాణ్యత గల శానిటరీ న్యాప్‌కిన్‌లను సులభంగా అందించే ఏర్పాటు చేశారు. నాణెం లేదా టోకెన్లు వేస్తే న్యాప్‌కిన్స్ అందుబాటులోకి వచ్చేస్తాయి. ఏవైనా సంస్థలు తమ మహిళా ఉద్యోగులకు అండగా నిలిచేలా ఉచితంగా ప్యాడ్స్ పంపిణీ చేయాలంటే.. మెషీన్‌లో ఏర్పాటు చేసిన వ్యవస్థలో ఫోన్ నంబర్ ఎంటర్ చేస్తే.. ఓటీపీ వస్తుంది. ఓటీపీ కొడితే.. ప్యాడ్ పొందేలా మెషీన్‌ని రూపొందించామని ఝాన్సీరాణి తెలిపారు. ఈ తరహా మెషీన్లు విద్యా సంస్థల్లోనూ, కార్యాలయాల్లో అందుబాటులో ఉంటే.. ఆ రోజుల్లో సెలవులు పెట్టే అవసరం ఉండబోదని ధీమాగా చెబుతున్నారు. ఇది మహిళా ఉద్యోగులు, విద్యార్థుల్లో మనోబలాన్ని పెంచుతుందని ఝాన్సీరాణి స్పష్టం చేస్తున్నారు.

# మహిళలకిచ్చిన హామీలేమయ్యాయి?

- ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం అమలు ఎప్పుడు?
- మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమల



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఏపీ మహిళా సమాఖ్య ప్రతినిధులు

**సీతమ్మధార:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా దినోత్సవం స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నాయని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 'గౌరవప్రదమైన జీవితం దాతృత్వం కాదు.. అది మన హక్కు' అనే నినాదంతో శుక్రవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ పాలకుల మాటల్లోనే మహిళా సాధికారత ఉందని, చేతల్లో లేదని విమర్శించారు. గ్రామిక మహిళల పోరాట స్ఫూర్తి క్రమంగా కనుమరుగు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం ఓటు బ్యాంకు రాజకీయాలకు వేదికగా మారిపోతోందని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో మహిళల ఓట్ల కోసం కురిపించిన హామీలు ఒక్కటి కూడా అమలు కావడం లేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం హామీలే ఇందుకు నిదర్శనమన్నారు. రాజ్యాంగం అందించిన సమానత్వం 75 ఏళ్లు అయినా సాధ్యం కాలేదని, నిత్యం మహిళా సమాజంపై దాడులు పెరుగుతున్నా పాలకులకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ పాలనలో మహిళా సమాజం మరో వంద ఏళ్లు వెనక్కి వెళ్లిపోతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళా దినోత్సవం అందించిన పోరాట స్ఫూర్తితో మహిళలు మరింత చైతన్యవంతంగా ఉద్యమాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎం.ఎ.బేగం, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి, నాయకులు ఎ.దేవుడమ్మ, అరుణ, అన్నపూర్ణ, జి.జయ, బి.పుష్పలత, పావని పాల్గొన్నారు.

## 'వరుణ్ హాస్పిటాలిటీ'పై ఏపీసీజెడ్ఎంఏ సీరియస్

**విశాఖ సిటీ:** బీచ్ రోడ్డులో వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేపట్టిన స్టార్ హోటల్ నిర్మాణంపై ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఏపీసీజెడ్ఎంఏ) స్పందించింది. సీఆర్‌జెడ్ పరిధిలో బోర్లు తవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. వెంటనే దీనిపై స్వయంగా విచారించి తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను ఆదేశించింది. గేట్ వే హోటల్ స్థలంలో వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ ఒక ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణం చేపడుతోంది. ఇందు కోసం సదరు సంస్థ తీర ప్రాంతానికి 150 మీటర్ల లోపే బోర్లు తీస్తోంది. దీనిపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఏపీసీజెడ్ఎంఏకు ఫిర్యాదు చేశారు. సీఆర్‌జెడ్ నోటిఫికేషన్ 2011 ప్రకారం తీర ప్రాంతానికి 150 మీటర్ల లోపు బోర్లు వేయడమే కాకుండా హైకోర్టు ఆదేశాల ప్రకారం తీర ప్రాంతానికి సమీపంలో భూగర్భం నుంచి నీటిని తోడడం నిషేధమని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఏపీసీజెడ్ఎంఏ స్పందిస్తూ, కలెక్టర్‌కు లేఖ రాసింది. వెంటనే జీవీఎంసీ కమిషనర్, గ్రౌండ్ వాటర్ అండ్ వాటర్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్లు నేరుగా నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని తనిఖీ చేయాలని ఆ లేఖలో పేర్కొంది. అలాగే దానిపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో సమర్పించాలని ఏపీసీజెడ్ఎంఏ మెంబర్ సెక్రటరీ ఎస్.శ్రీ శరవణన్ ఆదేశించారు.

## వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్ట్, విడుదల



వాసుపల్లి నేతృత్వంలో శ్యామ్‌సుందర్‌ను విడిపించిన 'దక్షిణ' నాయకులు

**దాబాగార్డెన్స్:** గుడివాడ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త శ్యాంసుందర్‌ను విశాఖ వన్‌టౌన్ పోలీసులు తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టకుండా వైఎస్సార్‌సీపీ కేడర్‌ని టార్గెట్ చేస్తూ, వేధించడం సరికాదన్నారు. శ్యామ్‌సుందర్ కుటుంబ సభ్యుల పరిస్థితి తెలుసుకుని వారికి యువకుడికి ష్యూరిటీ ఇప్పించి 41 నోటీసు ద్వారా విడిపించి, తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

**అప్రమత్తమైన వైఎస్సార్‌సీపీ కేడర్ :** వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త శ్యాంసుందర్‌ను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేయడాన్ని తెలుసుకున్న వాసుపల్లి, స్థానిక నాయకుల్ని అప్రమత్తం చేశారు. తక్షణమే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిందిగా సూచించారు. పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పలు వార్డుల నాయకులు పీతల వాసు, ముత్తాబత్తుల రమేష్, యువజన విభాగం అధ్యక్షుడు, తాడి రవితేజ, సోషల్ మీడియా ప్రెసిడెంట్ బెవర మహేష్, కంటుముచ్చు సాగర్, సూర్యనాయుడు, గోపిరాజు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐతో మాట్లాడారు. ష్యూరిటీ ఇప్పించి, 41 నోటీస్ ద్వారా శ్యామ్ సుందర్‌ను విడిపించారు. అనంతరం శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ వాసుపల్లి గణేష్‌కుమార్‌కు, నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సైబర్ నేరాల కట్టడికి 12 మంది నియామకం

**విశాఖ సిటీ:** నగరంలో సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు కంప్యూటర్ నైపుణ్యం ఉన్న 12 మందిని బీ కేటగిరీ హోంగార్డులుగా నియమించారు. వీరికి శుక్రవారం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి నియామక పత్రాలు అందజేశారు.

| VEHICLE FOR SALE | | |
|---|---|---|
| Vehicle no. | Make | Model |
| AP31TH6778 | TATA LPT 3718 | 2017 |
| AP39VL1245 | MARUTI SWIFT | 2014 |
| AP31VL0144 | HYUNDAI XCENT | 2016 |
| AP39UP8873 | MARUTI DZIRE | 2015 |
| Contact: 9989500951 | | |
| AP39TZ0698 | AL 1616 REEFER | 2011 |
| AP31TJ0671 | TATA ACE MEGA | 2017 |
| Contact: 9849981250 | | |
| AP39TV7456 | FORCE TRAX | 2021 |
| Contact: 9989091814 | | |
| SHRIRAM FINANCE LIMITED | | |

## మరో ఇద్దరిపై పీడీ యాక్ట్

**అల్లిపురం:** శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధి అంబేడ్కర్ కాలనీకి చెందిన రావాడ ఉదయ్ భాస్కర్, ఈతలపాక రాజ్‌కుమార్‌లపై పీడీ యాక్ట్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే వీరిద్దరూ పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఏడాది కాలం పాటు వీరికి నగర బహిష్కరణ విధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## నైవేద్యం హోటల్ ప్రారంభం



నైవేద్యం హోటల్‌ను ప్రారంభిస్తున్న త్రిదండి చినజీయర్‌స్వామి

**సింహాచలం:** హనుమంతవాక నుంచి అడవివరం వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డు.. సింహాచలం కొండపైకి వెళ్లే రెండో ఘాట్‌రోడ్డు టోల్‌గేట్‌కు సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన నైవేద్యం అల్పాహార హోటల్‌ను త్రిదండి చినజీయర్‌స్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా చినజీయర్‌స్వామి మాట్లాడుతూ పల్లెటూరి వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ పెంకుటింట్లో సంప్రదాయ రుచులతో నైవేద్యం హోటల్‌ను ఏర్పాటు చేయడం ఎంతో బాగుందన్నారు. ఈ సందర్భంగా హోటల్ యజమాని వాకాడ రాజశేఖర్‌రెడ్డి, ఆయన సోదరుడు వాకాడ శరత్‌కుమార్‌రెడ్డిలకు ఆశీసులు అందజేశారు. ఈనెల 14 నుంచి హోటల్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. హోటల్‌లో ఏర్పాటు చేసిన కిచెన్‌ను సైకాలజిస్ట్ కర్రి భాగ్యార్కసిన్హా ప్రారంభించారు. కర్రి పాపారాయుడు, సీఐ డాక్టర్ బెండి వెంకట్రావు, వర్మ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# మహిళ అనుమానాస్పద మృతి

**అప్పు ఇచ్చిన వారింట్లోనే ఘటన**

- హత్యేనని ఆరోపిస్తున్న మృతురాలి బంధువులు
- అచ్చియ్యమ్మపేటలో విషాదం



సుగుణ (ఫైల్)



ఆందోళన చేస్తున్న సుగుణ భర్త, ఇద్దరు పిల్లలు

**అల్లిపురం:** అచ్చియ్యమ్మపేటలో ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అప్పు తీసుకున్న ఇంట్లోనే ఆమె శవమై కనిపించడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె ఆత్మహత్యకు పాల్పడ్డారా లేదా హత్యకు గురయ్యారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇది ఆత్మహత్య కాదని హత్యేనని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.

టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలివి.. అంగడిదిబ్బ ప్రాంతానికి చెందిన బొడ్డు సుగుణ(34), తన భర్త అప్పన్న, ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. సుగుణ అచ్చియ్యమ్మపేటకు చెందిన ధనలక్ష్మి వద్ద లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నారు. ఆ సమయంలో ధనలక్ష్మి డబ్బులు ఇచ్చినందుకు వీడియో కూడా తీసింది. రూ.లక్షకు వారానికి రూ.20 వేలు అసలు, వడ్డీ చెల్లించేలా ఒప్పందం కుదిరింది. అయితే, సుగుణ సకాలంలో వడ్డీ చెల్లించలేకపోవడంతో, ధనలక్ష్మి, ఆమె కుమారుడు భరత్ గురువారం సుగుణ ఇంటికి వెళ్లి గొడవపడ్డారు. వెంటనే డబ్బులు చెల్లించాలని, లేకపోతే వీడియోను అప్పన్నకు పంపిస్తానని బెదిరించారు. దీంతో మనస్తాపం చెందిన సుగుణ గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో రూ.40 వేలు పట్టుకుని ధనలక్ష్మి ఇంటికి బయలుదేరింది. డబ్బులు ఇచ్చేందుకు ఆమె ఇంట్లోకి వెళ్లగా.. ధనలక్ష్మి లేరు. ఇంట్లో ఆమె చిన్న కుమారుడు ఒక్కడే ఉన్నాడు. కాగా.. రాత్రి 7 గంటలకు ఇంటికి తిరిగి వచ్చిన ధనలక్ష్మి.. గదిలో ఫ్యానుకు వేలాడుతున్న సుగుణ మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించింది. వారు ఘటనా స్థలానికి చేరుకుని తలుపులు బద్దల గొట్టి మృతదేహాన్ని కిందకు దించారు. విషయం తెలుసుకున్న సుగుణ భర్త అప్పన్న, తన భార్యను ధనలక్ష్మి కుటుంబ సభ్యులే హత్య చేశారని, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు కూడా వారితో కుమ్మక్కయ్యారని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం అప్పన్న, అతని ఇద్దరు కుమారులు, మృతురాలి బంధువులు టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని, ధనలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు ధనలక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సుగుణ చనిపోయే ముందు బయట నుంచి స్టూలు పట్టుకుని ధనలక్ష్మి ఇంట్లోకి వెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డ్ అయి ఉందని పోలీసులు వెల్లడించారు.

**'నా చావుకు ధనలక్ష్మియే కారణం..'**

మరణించే ముందు సుగుణ తన భర్త అప్పన్నకు వాయిస్ మెసేజ్ పంపింది. 'నా చావుకు ధనలక్ష్మి, ఆమె కుమారుడు భరత్ కారణం. నా కోసం బాధపడవద్దు. నేను అప్పులు మాత్రమే చేశాను. నా వల్ల నువ్వు, పిల్లలు సుఖపడలేరు. ధనలక్ష్మి నన్ను టార్చర్ పెడుతోంది. ఈ టార్చర్ నాతోనే పోవాలి. నా వల్ల మీరు బాధపడకూడదు. పిల్లలను హాస్టల్‌లో చేర్పించి బాగా చదివించు. నువ్వు నా కోసం బాధపడవద్దు'అని సుగుణ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వాయిస్ మెసేజ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## రైల్వే బోర్డ్ డైరెక్టర్‌గా స్టీల్‌ప్లాంట్ అధికారి సుగుణ

**ఉక్కునగరం:** భారతీయ రైల్వే బోర్డ్ డైరెక్టర్(రాజ్‌భాష)గా విశాఖ స్టీల్‌ప్లాంట్ రాజభాష విభాగం సీనియర్ మేనేజర్ డాక్టర్ వి.సుగుణ ఎంపికయ్యారు. ఈ పోస్టుకు జరిగిన ఇంటర్వ్యూలో సుగుణ ఎంపికైనట్లు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ పోస్టులో ఆమె ఐదేళ్లపాటు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించనున్నారు. డాక్టర్ సుగుణ 1992 నుంచి స్టీల్‌ప్లాంట్ అధికార భాష అమలు, వివిధ పత్రాల అనువాదం, రాజ్‌భాష హిందీ ప్రచారంలో విశేషమైన అనుభవం కలిగి ఉన్నారు.

## హెల్త్‌సిటీలో రక్త రుగ్మతల కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మామ్మెన్ చాందీ

**ఆరిలోవ:** హెల్త్‌సిటీ యునిక్ ఆస్పత్రిలో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్త రుగ్మతుల కేంద్రం అందుబాటులోకి వచ్చింది. ఈ కేంద్రాన్ని ప్రముఖ వైద్యుడు డాక్టర్ మామ్మెన్ చాందీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సికిల్ సెల్, తలసేమియాతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఉన్నారన్నారు. అలాంటి వారికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. పేదలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా ఈ కేంద్రాన్ని నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఈ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఉన్న మురళీకృష్ణను అభినందించారు. నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు మాట్లాడుతూ విశాఖలో రక్త రుగ్మతుల కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఆరోగ్య సంరక్షణలో కీలక ముందడుగు పడిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. అలాంటి సమస్యల నివారణకు ఈ కేంద్రం అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఏపీతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ఎక్కడా రక్త వ్యాధులను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా హెమటాలజీ కేంద్రం లేదన్నారు. ఈ లోటును భర్తీ చేయడానికి ఇక్కడ సమగ్ర రక్త రుగ్మతల కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పలువురు ఆంకాలజీ విభాగం వైద్యులు పాల్గొన్నారు.